మర్యాదపూర్వక భేటీ

కాకినాడ: రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన జమ్మలమడక నాగమణి ఆదివారం పలువురు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసారు. కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, రాష్ట్ర సివిల్ సప్ల యిస్ కార్పొరేషన్ చైర్మన్ ద్వారంపూడి భాస్కరరెడ్డి, ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి తదితరులను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.



రక్షిత నీటిపై నిర్లక్ష్యం..

- రెండేళ్లుగా పనిచేయని ఆర్వో ప్లాంట్
- మరమ్మతులకు మీనమేషాలు లెక్కిస్తున్న మున్సిపల్ సిబ్బంది
- ఐదు వార్డుల ప్రజలకు తప్పని తిప్పలు

సామర్లకోట: గోటితో పోయేదానికి గొడ్డలిదాకా తెచ్చుకోవడం అధికారులకు పరిపాటిగా మారింది. ఏదైనా చిన్న సమస్య వస్తే దాని పరిష్కారానికి శ్రద్ధ చూపకుండా చిరిగి చేటంతై చాపంతయ్యే దాకా తీసుకువస్తారు. సురక్షిత నీటిని అందించాల్సిన ఆర్వో ప్లాంటు విషయంలో అధికారుల తీరు ఇలాగే ఉంది. అసలే వేసవి. తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవలసిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. స్థానిక గణపతినగరం వాటర్ ట్యాంకుల వద్ద నవభారత్ వెంచర్స్ వారు తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేసి మున్సిపాలిటీకి అప్పగించింది. నాటి నుంచి ఈ ఆర్వో ప్లాంటు నీటిని 27 నుంచి 31వ వార్డుల ప్రజలు వినియోగించేవారు. 20 లీటర్ల టిన్ రెండు రూపాయలకు అందిస్తున్నారు. దీనితో పాటు కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న వాటర్ ట్యాంకుల వద్ద ఉన్న ఆర్వో ప్లాటును మున్సిపాలిటీ నిర్వాహణలో కొనసాగుతోంది. ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తున్న ఆర్వో ప్లాంట్ల వద్ద తాగునీరు రూ.5కు విక్రయిస్తున్నారు. గణపతినగరం వద్ద ఆర్వో ప్లాంటు గత రెండేళ్లుగా నిరుపయోగంగా మారడంతో ఆయా వార్డుల ప్రజలకు ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తున్న ప్లాంటు నీటిపై ఆధారపడాల్సి వస్తోంది.

ప్రైవేటు ప్లాంట్ల హవా..

మున్సిపాలిటీ నిర్వహణలో నిర్వహిస్తున్న ఈ రెండు ప్లాంట్లతో పాటు ప్రైవేటుగా 8 ప్లాంట్లు తాగునీటిని అందజేస్తున్నాయి. కెమికల్ ల్యాబ్‌లో నీటి పరీక్ష సర్టిఫికెట్ల ఆధారంగా ఈ ప్లాంట్లకు మున్సిపాలిటీ అనుమతులు ఇస్తుంది. వీటిలో టిన్ను నీరు రూ.20 నుంచి రూ.40 వరకు వసూలు చేస్తారు.


గణపతినగరం వాటర్ ట్యాంకుల వద్ద నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంటు

మరమ్మతులకు రూ.40 వేలు



గణపతినగరం ఆర్వో ప్లాంటు మరమ్మతులకు రూ.40 వేలు ఖర్చవుతుంది. నిధులు రాగానే మరమ్మతు చేస్తాం. ప్రైవేటు ప్లాంట్లలో నీటి నాణ్యతపై ఫిర్యాదులు వస్తే మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు తనిఖీచేసి తగిన చర్యలు తీసుకుంటారు.

– హుస్సేన్, మున్సిపల్ డీఈ, సామర్లకోట

కౌన్సిల్‌లో అడుగుతున్నా చర్యలు లేవు



ఆరు నెలలుగా ప్రతి కౌన్సిల్ సమావేశంలో గణపతినగరం ప్లాంటు మరమ్మతుల గురించి అడుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రూ.40 వేల గురించి ఆలోచిస్తున్నారు. త్వరగా సమస్య పరిష్కరించాలి.

– కరణం రాజ్‌కుమార్, కౌన్సిలర్, సామర్లకోట

డీఈతో చర్చించి సమస్య పరిష్కరిస్తాం



వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రయత్నిస్తున్నాం. గణపతినగరం ప్లాంటుకు సంబంధించి కొన్ని విడిభాగాలు దొరకడం లేదు. డీఈతో చర్చించి చర్యలు తీసుకొంటాం. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాల్సి ఉంది.

– సీఎంపీ నయీం అహ్మద్, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

బ్రౌన్‌పేటలో భారీ అన్నదానం


అన్నదానాన్ని ప్రారంభించిన దవులూరి దొరబాబు

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేటలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ ఏర్పాటు చేసిన అన్న దానాన్ని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రారంభించారు. అయ్యరక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పెద్దాపురం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రచార జాతా విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు పిలుపునిచ్చారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ప్రచార జాత వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నీలపాల సూరిబాబు అధ్యక్షతన జరిగిన సభలో ప్రసాదరావు, సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, డి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.





నమ్మకమైన నాయకుడు జగనన్న

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గోర్సలో గడప గడపకూ మన ప్రభుత్వం


గోర్సలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నవరత్నాలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాల్ని అందజేస్తున్న నమ్మకమైన నాయకుడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని గోర్స గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. శివారు వీధులకు తాగునీరు సక్రమంగా అందటం లేదని మహిళలు ఆయన దృష్టికి తీసుకురాగా, సమస్య వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాట కోసం సంక్షేమ పథకాల్ని అమలు చేస్తూ మడం తిప్పని నాయకుడిగా జగనన్న చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. పద్మశాలి వీధిలో మండల పరిషత్, ఎమ్మెల్యే నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న మల్టీపర్పస్ భవనానికి, వెలంపేట రామాలయంలో రూ.8 లక్షల ఎమ్మెల్యే నిధులతో నిర్మించనున్న ప్రహరీ, మల్టీపర్పస్ భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీరామనవమిని పురస్కరించుకుని నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అన్న సమారాధన నిర్వహిస్తున్న కమిటీ సభ్యులకు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రొంగల వీరబాబు, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.





అమ్మవారి జాతరలు సంస్కృతికి చిహ్నాలు


గరగ ఎత్తుకుని జాతరను ప్రారంభిస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీత

- కాకినాడ ఎంపీ వంగా గీత
- వైభవంగా ప్రారంభమైన వేగుళ్లమ్మ జాతర

పిఠాపురం: ఏటా క్రమం తప్పకుండా నిర్వహించే అమ్మవారి జాతరలు మన సంస్కృతికి చిహ్నాలని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. ఆదివారం గొల్లప్రోలు మండలం దుర్గాడలో గరగనెత్తుకుని వేగుళ్లమ్మ అమ్మవారి జాతరను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ దేవతలు గ్రామానికి మూల విరాట్టుగా ఉంటారన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తోందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారి గరగను శిరస్సున ధరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 20 వరకు నిర్వహించనున్న అమ్మవారి జాతర వైభవంగా జరిగేలా ప్రజలు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.


ప్రత్యేక అలంకరణలో వేగుళ్లమ్మ అమ్మవారు

మూడోసారి అధ్యక్షుడిగా మేరుగు రాజారావు


నూతనంగా ఎన్నికైన పిఠాపురం బార్ అసోసియేషన్ సభ్యులు

పిఠాపురం: పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది మేరుగు రాజారావు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పిఠాపురం కోర్టుల సముదాయంలో నిర్వహించిన పిఠాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో రాజారావును న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పిఠాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారి సీనియర్ న్యాయవాది పడాల రవి తెలిపారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్ఎం ఆలీ, ప్రధాన కార్యదర్శిగా కేఎస్ఆర్ భాస్కర్, స్పోర్ట్సు సెక్రటరీగా ఎంవీవీఎస్ సత్యనారాయణ, లైబ్రరీ సెక్రటరీగా ఎ.అప్పారావు, మహిళా ప్రతినిధిగా ఎం.సత్యవతి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఆయన ప్రకటించారు. తనను మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్న న్యాయవాదుల పరిరక్షణకు ఎల్లవేళలా కృషి చేస్తానని రాజారావు తెలిపారు.











టోల్‌గేట్‌లోకి దూసుకెళ్లిన కారు


అదుపు తప్పి టోల్‌గేట్‌లోకి దూసుకెళ్లిన కారు

పిఠాపురం: ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొని ఒక కారు అదుపు తప్పి టోల్‌గేట్‌లోకి దూసుకెళ్లిన ఘటన ఆదివారం 216 జాతీయ రహదారిలోని గొల్లప్రోలు టోల్‌గేట్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గొల్లప్రోలు మండలం తాటిపర్తి నుంచి పిఠాపురం వస్తున్న ఒక కారును పిఠాపురం వైపు నుంచి గొల్లప్రోలు వైపు వెళుతున్న మరో కారు ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన కారు టోల్‌గేట్‌లోకి దూసుకెళ్లి డివైడర్‌ను ఢీకొని ఆగింది. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఉచిత పాలిసెట్ కోచింగ్

పిఠాపురం: పిఠాపురం ఆదిత్య స్కూల్లో ఉచిత పాలిసెట్ కోచింగ్ ఏర్పాటు చేసినట్లు పిఠాపురం మహారాజా కుమారుడు ఆర్‌వీఎంఆర్ రత్నారావు తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి కోచింగ్ ప్రారంభమవుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాని ఆయన సూచించారు. ఉత్తమమైన ఉపాధ్యాయ బృందంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు కోచింగ్ నిర్వహించనున్నట్లు ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ శృతిరెడ్డి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 7658916668, 7396946662, 7075486664 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం గ్రామంలోని 11 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల వల్ల సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ జి.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల వేట్లపాలెం, ఇండస్ట్రియల్ ఏరియా, హుస్సేన్‌పురం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ముగిసిన అంబేడ్కర్ జయంత్యుత్సవాలు


ముగ్గుల పోటీల్లో విజేతకు బహుమతి అందజేస్తున్న నాయకులు

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేటలో మూడు రోజుల పాటు నిర్వహించిన అంబేడ్కర్ జయంత్యుత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ బాలురకు వాలీబాల్, మహిళలకు ముగ్గుల పోటీలు, బాలబాలికలను అంబేడ్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలు ముగింపును పురస్కరించుకొని విజేతలకు బహుమతులు అందజేశారు. బ్రౌన్‌పేటకు చెందిన నాయకులు విజేతలకు బహుమతులు అందజేశారు.

